
# సార్థకత



-వాలి హిరణ్మయీ దేవి

"ఎవరే, ఆ ముసలాయన? ఏంటి అతన్ని తీసికెళ్ళి మన గెస్ట్ హౌస్‌లో పడుకోబెట్టావ్"? అడిగింది కామేశ్వరి, లోపలికి వస్తున్న మైథిలితో.

"పాపం. ఎవరో ఒక అభాగ్యుడు. అసలే జ్వరంలో ఉన్నాడు- పైగా దెబ్బలు తగిలి స్పృహ కోల్పోయి ఉన్నాడు. అందరూ వింతగా చూస్తున్నారే తప్ప ఎవరూ పట్టించుకోవటంలేదు. చాలా బాధనిపించిందమ్మా- అందుకే..." అంటూ ఆగింది మైథిలి.

"బాధనిపిస్తే? అతడినేహాస్పిటల్‌కి పంపడమో- ఏ అనాథ శరణాలయం వాళ్ళకో ఫోన్ చేయడం చేయాలి గానీ ఏకంగా ఇలా ఇంటికి తీసుకురావడం ఏంటీ?" చిరాగ్గా అంది కామేశ్వరి.

"తీసుకొస్తే ఏమయిందమ్మా- ఒక్క మనిషికింత పెడితే మనకున్న సిరి సంపదలు తరిగిపోతాయా? దేవుడిచ్చిన ఆస్తి వుంది. నాకు మంచి ఉద్యోగముంది. ఈ ఒక్క ప్రాణిని భరించే ఆర్థిక స్థోమత ఉంది."

"ఆ... ఆ... అన్నీ ఉన్నాయ్. రోజులే బాగాలేవు. ఈ మనిషి మనకు తర్వాతేదన్నా అపకారం తలపెడితేనో- అసలే మగ దిక్కులేని వాళ్ళం- ఇవన్నీ భరించలేక?" అంది కోపంగా కామేశ్వరి.

"అబ్బా! ఎప్పుడూ నెగటివ్ ఆలోచనలే- పాపం ముందు ఆ తాతని కాస్త తేరుకోని- అతడు నువ్వన్నట్లుగా ప్రమాదకారిగా తోస్తే నేనే అతడిని మనింట్లోంచి పంపించేస్తాను- సరేనా?" అంది మైథిలి వేడి పాలను చల్లారుస్తూ. ఆ పాలని తీసుకు వెడుతోన్న కామేశ్వరితో.

"ఏంటో నీ మొండితనం నీదే? లేనిపోని తద్దినాలని తలకి చుట్టుకొంటావ్" అంది కామేశ్వరి, మైథిలి వెనుకే వెడుతూ.

"అమ్మా- అప్పుడూ అందరూ నీలాగే ఆలోచించబట్టే బతికే ఛాన్స్ ఉండి గూడా ఆక్సిడెంట్‌లో నాన్న ప్రాణాల్ని నిస్సహాయంగా కోల్పోవలసి వచ్చింది. ఎవరన్నా ముందు కొచ్చి ఉంటే నాన్న మనకి దక్కేవారు కాదూ..." అంది మైథిలి గాద్గదిక స్వరంతో.

ఇక దాంతో ఏమీ మాట్లాడలేకపోయింది కామేశ్వరి.

"అమ్మా కామేశ్వరీ! ఈ కూరగాయల్ని ఫ్రిజ్‌లో సర్దేయమంటావా" అడిగాడు ఆదినారాయణ.

"ఉండనీ బాబాయ్! ఇప్పుడేగా మార్కెట్‌నుండి వచ్చావ్ -కాస్త రిలాక్స్ అయ్యాక సర్దుకోవచ్చులే. అయినా నేనున్నాగా. తర్వాత సర్దుతాలే" అంది కామేశ్వరి అతనికి మంచి నీళ్ళందిస్తూ.

"నువ్వెందుకమ్మా? నాకు పొద్దుపోవాలిగా. నేనాపని చేస్తాను. ఇంకో నెల ఆగితే మనమిక కూరగాయలేం కొనక్కర్లేదు. అన్నీ మన పెరట్లోంచే వస్తాయ్" అన్నాడతను మంచినీళ్ళు తాగుతూ.

"తాతయ్యా! నిన్ను రెస్ట్ తీసుకోమంటే ఈ పన్లన్నీ మీదేసుకొంటావేం?" అంది మైథిలి.

"ఏ పనీ లేకుండా ఎలా ఉండనమ్మా? అయినా ఇదెంత పనని?" అన్నాడతను మైథిలి తలని ఆపేక్షగా నిమురుతూ.

వారిద్దరి మాటలు వింటూ నవ్వుకొంది కామేశ్వరి.

ఆరోజు అతనింటికి తెచ్చినపుడు తను భయపడింది. ఇప్పుడో- అతను తమకో పెద్ద దిక్కుగా మారాడు. చెబితే గానీ అతనో పరాయి వ్యక్తని ఎవరికీ తెలీనంతగా కలిసిపోయాడు. ఇదివరకు ఇంటి పని- బజారు పనీ చేసుకోలేక అవస్థపడేది- ఇప్పుడు ప్రతీ పనిలోనూ సాయంగా వచ్చే ఆదినారాయణ బాబాయ్‌వల్ల, టైమ్ బాగా మిగిలి తనెప్పుడో వదిలేసిన పెయింటింగ్‌ని మళ్ళీ మొదలుపెట్టింది. ఇప్పుడంతా తను వేసిన పెయింటింగ్స్‌ని మెచ్చుకొంటూంటే అదంతా అతని చలవే అన్పిస్తోంది ఆమెకి.

'నీ బొమ్మలనన్నింటిని ఎగ్జిబిషన్‌లో పెడదాం- అప్పుడే మంచి గుర్తింపు వస్తుంది' అంటూ కన్న తండ్రికన్నా ఎక్కువగా తనని ప్రోత్సహిస్తున్నాడు. దీనికంతటికీ మూల కారణం మైథిలి అనుకోగానే ఆమెకి కూతురి మీద ఎక్కడ్లేని మురిపెం కల్గింది. 'వయసులో చిన్నదయినా, ఏ పనైనా ఆలోచించి చేస్తుంది. దాని మంచితనమే తమకి శ్రీరామరక్షవుతోంది' అనుకొంది ఎంతో మురిపెంగా.

* * *

"మీ అమ్మాయి మాకు బాగా నచ్చింది. కట్నకానుకలేమీ అక్కర్లేదు గానీ పెళ్ళి మాత్రం ఘనంగా మా స్టేటస్‌కి తగ్గట్లుగా జరిపించాలి" అన్నాడు అబ్బాయి తండ్రి.

"నా ఫ్రెండ్స్ చాలామంది వస్తారు. వాళ్ళేవిషయంలోనూ ఫీలవ్వకుండా చూడాలి" చెప్పింది అబ్బాయి చెల్లెలు.

అబ్బాయేమన్నా మాట్లాడతాడని మైథిలి అతని వంక చూసింది. అతడా ప్రయత్నంలో లేకపోవడంతో "నేను మీతో నా ఎజెండా గురించి చెప్పాలి" అంది సూటిగా.

కామేశ్వరి కంగారు పడుతూ చూసింది. ఆదినారాయణ కళ్ళతోనే ధైర్యం చెప్పాడు. "పదండి అలా లాన్‌లోకి వెళ్ళి మాట్లాడదాం" అంటూ దారి తీసింది మైథిలి. చిన్నగా భుజాలు ఎగరేసి, ఆమెనే అనుసరించాడు పెళ్ళిచూపులకొచ్చిన శ్రీరామ్.

"ఆ... చూడండి మిస్టర్ శ్రీరామ్. మన దేశ జనాభా గురించి మీ అభిప్రాయం ఏంటి?" అడిగింది మైథిలి.

అతడు ముందు తెల్లబోయినా, తమాయించుకొని "మన దేశాభివృద్ధికి ప్రధాన ఆటంకం" అన్నాడు.

"వెరీ గుడ్. ఆ సంగతి గ్రహించారుగా. మన పెళ్ళయ్యాక ఎందరు పిల్లలుండాలని మీ కోరిక?"

ఆమె ధైర్యానికి ఆశ్చర్యపోతూనే "ఇద్దరు- లేక ముగ్గురు" అన్నాడు సింపుల్‌గా. "బాప్‌రే! ఇప్పుడేగా అధిక జనాభావల్ల నష్టమని చెప్పారు? ఏ అనాథనో అడాప్ట్ చేసుకొంటే సరిపోదా?" అంది మైథిలి.

"అనాథలు మన స్వంత పిల్లలెలా అవుతారు? మన రక్తం పంచుకు పుట్టినవాళ్ళే మన పిల్లలవుతారు" అన్నాడతను.

"అంటే మనం పెంచుకొనే పిల్లలు మన పిల్లలవరా?" అడిగింది కాస్త నిరాశగా.

"మన వారసులంటూ కావాలిగా వంశాభివృద్ధికి" అన్నాడు శ్రీరామ్.

"వంశం. హు... మీకు ముందున్న నాల్గుతరాల వారి పేర్లన్నా మీకు గుర్తున్నాయా? చెప్పండి" అంది మైథిలి.

ఆలోచిస్తే తాత పేరు వరకు మాత్రమే గుర్తొచ్చింది. ముత్తాత పేరు అతి బలవంతపు ఆలోచనతో గుర్తొచ్చింది. అదేమాట చెప్పాడామెతో.

"చూశారా! మన ముత్తాత పేర్లే గుర్తుండని మనం 'వంశం' అంటూ లేనిపోనివి ఆలోచించడం ఎందుకు? ముక్కూమొహం ఎరుగని మనం పెళ్ళి పేరుతో ఒకరికొకరమవుతాం. అలాగే మన ఒడిలోకి తీసుకొన్న చిన్నారి మన బిడ్డవుతుందిగా- కనాలనే రూలేం ఉంది" అడిగింది మైథిలి.

"మీకేదన్నా ప్రాబ్లెం ఉందా"? కాస్త అనుమానంగా అడిగాడతను.

"దేవుడి దయవల్ల లేదనుకొంటాను. మీరు మీ కోరికల లిస్ట్ చెప్పారు. మా అమ్మ అంగీకరించింది. నేను నా కోరిక చెప్పాను. అది తీర్చలేరా?" అంది మైథిలి.

"అదేం కోరిక- పిచ్చి కోరిక కాకపోతే" అన్నాడు శ్రీరామ్- నిర్లక్ష్యంగా. దాంతో కోపం ముంచుకొచ్చింది మైథిలికి.

"నాకూ మీ ప్రపోజల్స్ అన్నీ పిచ్చి కోరికల్లాగే అన్పించినా మా అమ్మకోసం మౌనం వహించాను. ఘనంగా పెళ్ళి

జరిపించమన్నారే- దానికి వేలకి వేల డబ్బు నీళ్ళలా వృధా అవుతుంది. ఈ రోజుల్లో నీళ్ళని గూడా వృధాచేయటం లేదనుకోండి. నాల్గురకాలు చేసినా తిన్న వాళ్ళు వంకలు పెట్టడం తప్ప ఒరిగేదేమీ లేదు. ఆ తిన్న వాళ్ళంతా మనకి ఆపదొచ్చినప్పుడు ఆదుకొంటారన్న గ్యారంటీ లేదు- అదే సింపుల్‌గా ఏ రిజిస్టర్ మారేజో చేసుకొని, కొంత డబ్బు ఏ అనాధ శరణాలయాలకో- లేదా అనాధల్ని పిలిచి అన్నదానం చేస్తేనో ఎంత బావుంటుంది. ఇలాంటి పనులు మీకు పిచ్చిగా అన్పిస్తాయి. ఒక అనాధకి జీవితం ఇద్దామన్న నా కోరిక పిచ్చిగా ఉందా? నిదానంగా ఆలోచించండి."

"ఆలోచించే పనే లేదు. నాకు కావలసింది భార్య. ఓ సంఘసంస్కర్త కాదు" అంటూ మొహం కందగడ్డలా చేసుకొని కదిలాడతను. అతని వంక జాలిగా చూస్తూ ఉండిపోయింది మైథిలి.

* * *

నెలలు గడుస్తున్నా, మైథిలికి ఏ సంబంధమూ కుదరకపోవటం కామేశ్వరికి పిచ్చెక్కిస్తోంది.

"బాబాయ్! అది మీ మాట వింటుంది- మీరైనా నచ్చజెప్పండి. ఏ పెళ్ళికొడుక్కీ తన ఎజెండా గురించి చెప్పొద్దని చెప్పండి. పెళ్ళయ్యాక ఎలాగోలా ఒప్పించుకొంటే నయం కదా" అంది ఆదినారాయణతో.

"ఎందుకమ్మా అంత ఆదుర్దా. మైథిలి తెలివిగల పిల్ల. పెళ్ళికి ముందే మనసు విప్పి చెప్పడం మంచిది. అందుకిష్టపడ్డవాళ్ళే వస్తారు. లేదంటే పెళ్ళి అయ్యాక, మనస్పర్థల్లోస్తే విడిపోవడమే అవుతుంది" అంటూ నచ్చజెప్పాడతను.

"హాయ్ మామ్- ఏంటీ శిఖరాగ్ర చర్చలు- నా గురించేనా?" లోపలికి వస్తూ అడిగింది మైథిలి.

"నేను నీతో మాట్లాడను పో- గుడికి రమ్మంటే రాలేదు గానీ" అంది కినుకగా కామేశ్వరి.

తల్లి పక్కగా కూర్చుని, భుజాల చుట్టూ చెయ్యేస్తూ "అమ్మా! అక్కడికొస్తే నాకు ఊపిరాడనట్లుంటుంది. లెంపలు టపటప వేసుకొని, కొబ్బరికాయలు టకటకా కొట్టే కొడుకులు, తల్లితండ్రుల మనసుల్ని అలాగే ముక్కలు చేస్తుంటారు. తల్లితండ్రుల్ని వృద్ధాశ్రమానికి పంపేసిన ఎదురింటి అంకుల్, ఆంటీలు నియమం తప్పకుండా పూజలు చేస్తుంటారు. మానవత్వాన్ని మించినదేముంటుంది? మనిషిగా వారి బాధ్యతల్ని నిర్వహించకుండా, దేవుడికి లక్షలు లక్షలు ఖర్చు చేస్తుంటారు. నిజంగా వాళ్ళకి పుణ్యం దొరుకుతుందా? అసలు కాస్త స్థిమితంగా ఆలోచిస్తే వాళ్ళకైనా సంతృప్తిగా ఉంటుందాని? అందుకే ఈ గుళ్ళూ గోపురాలు నాకు నచ్చవ్. నేను అనాధాశ్రమంలో గానీ, వృద్ధాశ్రమంలో గానీ కాలు పెట్టగానే నవ్వుతూ ఎదురొచ్చే ఆ పసి పాపలు, జీవితంలో అలసిసొలసిన ఆ వృద్ధులు నిజంగా నా వాళ్ళనిపిస్తారు. వారి మొహంలో ఆ చిరునవ్వు చూడాలనేగా వారానికి రెండుసార్లు వెళ్ళేది" అంది మైథిలి.

"ఆ వారానికి రెండుసార్లేనా? ఆదివారం అని లేదు- సెలవు రోజని లేదు అక్కడేగా నీ మకాం? ఇంతకీ వాళ్ళని చూసి కడుపు నింపుకొని వచ్చావా? లేక అన్నం తినేదుందా?" టాపిక్ మారుస్తూ అంది కామేశ్వరి.

"నాకోసం ఎదురు చూసే మీ ఇద్దర్నీ వదిలేసి ఎలా తింటానమ్మా" అంటూ కిచెన్‌లోకి దారి తీసింది.

ఎన్ని పనులున్నా ప్రతీ పనిలోనూ తనకి తోడొచ్చే కూతుర్ని చూస్తే ఎంతో ముచ్చట ఆమెకి. అందుకే కోపాన్ని మరిచి మైథిలినే అనుసరించింది కామేశ్వరి.

* * *

గంటలు రోజులుగా, రోజులు వారాలుగా, వారాలు నెలలుగా, నెలలు సంవత్సరాలుగా రూపుదిద్దుకొంటున్నాయి.

"బాబాయ్. ఉన్నపళంగా బయలుదేరి రమ్మని అల్లుడుగారు ఫోన్ చేశారు. నాకెందుకో కంగారుగా ఉంది" అంది బ్యాగ్‌లో బట్టలు సర్దుకొంటూ కామేశ్వరి.

"ఎందుకమ్మా కంగారు. బాబుకి గానీ కాస్త నలతగా ఉందో- లేక మన మైథిలమ్మ మరోసారి తల్లి కాబోతున్నదో" ఆలోచిస్తూ అన్నాడు ఆదినారాయణ.

"మొదటిసారి తల్లి కావడానికే అది అంతగా ఇష్టపడలేదు- ఏదో అల్లుడిగారి మాట కాదన్లేక తల్లి అయింది గానీ- రెండోసారికి అస్సలు ఇష్టపడదు- మరేదో కారణం అయి ఉంటుంది" అంది కామేశ్వరి బయలుదేరుతూ.

"ఏంటండి అల్లుడుగారూ! ఉన్నపళంగా రమ్మని కబురు



"ఏంటమ్మా ఇది? బాబుకి తోడు కావాలంటే మరొకర్ని కనొచ్చు గా- ఈ పెంపకం గొడవెందుకు చెప్పు" అంది కామేశ్వరి.

చేశారు. అంతా కులాసేనే కదా" అంటూ అడిగిందామె అడుగు పెట్టీ పెట్టడంతోనే.

మైథిలి మొహం ఎర్రగా కందగడ్డలా ఉంది.

"ఏమయిందమ్మా" మైథిలి భుజంమీద చేయి వేస్తూ అడిగిందామె లాలనగా.

"ఏమైందో- ఆ సత్యహరిశ్చంద్రుణ్ణే అడుగు" కోపంగా అంది మైథిలి.

"మీ అమ్మాయికి పూర్తిగా మతి పోయింది" పళ్ళ బిగువున అన్నాడు తేజా.

"అదేం కాదు- ఉన్న మతిని సరిగ్గా నువ్వే వాడటం లేదు" కోపంగా అందామె. "చూశారా అత్తయ్యగారూ ఇదీవరస. ఎవరో కనిపారేసిన పిల్లని పట్టుకొచ్చింది. పెళ్ళికి ముందు అనాధని పెంచుకొంటానంటే ఒప్పుకొని, మాట తప్పుతారా అంటూ వాదిస్తోంది పైగా బాబుకో తోడుంటుందని అంటోంది."

"ఏంటమ్మా ఇది? బాబుకి తోడు కావాలంటే మరొకర్ని కనొచ్చుగా- ఈ పెంపకం గొడవెందుకు చెప్పు" అంది కామేశ్వరి.

"అమ్మా! నేను పెళ్ళికి ముందే చెప్పాను. ఓ అనాధకు జీవితాన్నివ్వడం నా ఆశయం అని. అప్పుడేమో నీకు అనాధని పెంచుకోవాలని ఎంతగా కోరిక ఉందో- అలాగే నా రక్తం పంచుకు పుట్టిన బిడ్డ- ఆడయినా- మగయినా ఒకరుండాలన్నది నా కోరిక. నా కోరిక మన్నిస్తే- నేను నీ కోరిక మన్నిస్తానని ప్రామిస్ చేసి, ఇప్పుడిలా మాట తప్పితే ఎలా"? విసుగ్గా అంది మైథిలి.

"ఏదో వయసు వేడిలోని ఆదర్శాలనుకొన్నాను" అన్నాడు మెల్లగా తేజా. "ఏంటీ?" నిర్ఘాంతపోతూ చూసింది మైథిలి.

"మీరు నా గురించి చాలా తక్కువ అంచనా వేస్తున్నారు. నేనేదో ఆదర్శాలు వల్లించాలని కాదు. మనసా, వాచా కర్మణా- నా జీవితాన్ని ఓ మంచి పనికి వినియోగించాలనుకొన్నాను. నా వ్యక్తిత్వాన్ని మన్నించగలనని అంటేనే పెళ్ళికి ఒప్పుకొన్నాను- లేదంటే పెళ్ళినైనా మానుకొనేదాన్నే" అందామె.

"అయితే ఇప్పుడీ కోరిక మన్నించకుంటే తెగతెంపులు చేసుకొని వెళ్ళిపోతావా?" కోపంగా అడిగాడు తేజా.

"అంతే. నాకు విలువ లేని ఇంట్లో ఉండటంలో అర్థం లేదు."

ఖచ్చితంగా చెప్పింది మైథిలి. తేజ నిర్ఘాంతపోయాడు.

"ఏంటేతల్లీ- ఎవరో ముక్కూ- మొహం ఎరుగని పిల్ల కోసం లక్షణమైన కాపురాన్ని కూలదోసుకొంటావా"? అంటూ లబలబ లాడింది కామేశ్వరి.

"కట్టుకొన్న భర్తకన్నా, కన్న కొడుకుకన్నా నిన్న దొరికిన పిల్ల నీకు ముఖ్యమా? నీ మాటలకెంత విలువ ఇచ్చిందీ ఈ ఐదేళ్ళ కాపురంలో నీకు తెలీలేదా?" నిష్ఠూరంగా అన్నాడు తేజా.

"ఆ మాటలన్నీ మీకు నచ్చినవే, మన సంసారానికి పనికొచ్చేవే కాబట్టి ఏ సమస్యా రాలేదు. అందుకు విరుద్ధంగా నేనొక్క కోరిక కోరగానే- ఇదుగో మీ బండారం ఇలా బైట పడింది" ఉక్రోషంగా అంది మైథిలి.

"అన్ని మాటలెందుకు- అసలు ఒక్క సంతానమే చాలనే దానివిగా" కాస్త తగ్గుతూ అన్నాడు తేజా.

"బాబు ఈమధ్య చాలా ఒంటరిగా ఫీలవుతూంటే గమనించి- ఎవర్నయినా తెచ్చి పెంచుకోవాలనుకొన్నాను- ఇంతలో అనుకోకుండా పాప దొరికింది అందుకే తెచ్చాను. పాపకో మంచి జీవితాన్ని అందించడం ద్వారా నా జీవితాన్ని సార్థకం చేసుకోవాలనుకొంటున్నాను" స్థిరంగా చెప్పింది మైథిలి.

"ఒకవేళ నేనిందుకు అభ్యంతరం చెబితే?" ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగాడు తేజా.

"ఓ... మీరింతవరకూ వచ్చారు కాబట్టి చెబుతున్నా- సింగిల్ పేరెంట్‌గా మారి బాబునీ పాపనీ పెంచుకొంటాను. మా నాన్నగారి ధర్మమా అని దొరికిన మంచి ఉద్యోగం ఉంది నాకు- అది చాలు మాకు" ఖచ్చితంగా చెప్పింది మైథిలి చాలా స్పష్టంగా.

దాంతో, ఆమె ఎంత బలంగా ఈ నిర్ణయం తీసుకొన్నదో అర్థమైంది తేజాకు, కామేశ్వరికి.

"మరీ అంత చంటి పిల్లకు పాలూ- అవీ ఎలాని?" కాస్త నసుగుతూ అన్నాడు తేజా.

ఆ మాటల్లో తొంగి చూస్తున్న అంగీకారానికి మైథిలి ముఖం వికసించింది.

"అవన్నీ నేను చూసుకొంటాను గానీ మీరో ప్రామిస్ చేయాలి" అంది మైథిలి సూటిగా.

"ఏంటి తల్లీ" భయంగా అడిగాడు తేజా.

నవ్వొచ్చింది మైథిలికి అయినా గంభీరంగా "బాబు పట్లా, పాపపట్లా మీరెలాంటి తేడా చూపించకూడదు. పాప మనకి దొరికిన పిల్లని తెలీకుండా పెంచాలి సరేనా" అంది స్పష్టంగా.

"సరే" అన్నాడు తేజా.

"భవిష్యత్తులో ఈ విషయం గురించి నేను బాధపడేలా చేయరుగా" కాస్త అనుమానంగా అడిగింది మైథిలి.

"నాకు గొడవలూ- గోలలు లేని 'స్వీట్ హోం' కావాలి మైథిలి. అలనాటి ఆ సీత తనని తన వ్యక్తిత్వాన్ని అనుమానించిన రాముణ్ణి త్యజించి భూదేవిలో లీనమైంది. ఆ పేరున్నందుకు నీకూ ఆత్మాభిమానం ఎక్కువే. అన్ని విషయాల్లో నాకనుగుణంగా ఉండే నిన్ను ఈ చిన్న విషయం గురించి వదులుకోలేనెప్పటికీ. కాబట్టి నిశ్చింతగా ఉండు" అన్నాడు. దాంతో నవ్వులు విరబూశాయి. ★